క్లుప్తంగా

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

హన్మకొండ: హనుమకొండలోని పలు ప్రాంతాల్లో ఈనెల 21న విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనుందని ఎన్పీడీసీఎల్ హనుమకొండ టౌన్ డీఈ జి.సాంబరెడ్డి తెలిపారు. ప్రశాంత్‌నగర్, పీజీఆర్ అపార్ట్‌మెంట్స్, సిద్ధార్థ నగర్ ప్రాంతాల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, ప్రకాశ్‌రెడ్డి పేట, పోస్టల్ కాలనీ, పోలీసు కాలనీ, ఎఫ్‌సీఐ కాలనీ, విద్యుత్ నగర్ ప్రాంతాల్లో మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

సమాజ సేవకు ఉత్తమ గవర్నర్ అవార్డు



వరంగల్: నిరుపేదలు, విద్యార్థులకు ఆహారం, నిత్యావసర వస్తువులను పంపిణీ చేసి సమాజ సేవకు అంకితమైనందున వరంగల్ కొత్తవాడకు చెందిన చిప్ప వెంకటేశ్వర్లు.. 2024–25 ఉత్తమ గవర్నర్‌గా ఎన్నికైనట్లు అసోసియేషన్ ఆఫ్ అలయన్స్ క్లబ్ ఇంటర్ నేషనల్ గురువారం ప్రకటించింది. ఈనెల 22వ తేదీలో చెన్నైలోని ఒక హోటల్‌లో జరగనున్న కన్వెన్షన్‌లో ఇంటర్నేషనల్ ప్రెసిడెంట్ చేతుల మీదుగా అవార్డును ఆయన అందుకోనున్నారు.

ఖోఖో పోటీలకు ఎంపిక

ఖిలా వరంగల్: ఈనెల 21 నుంచి 24వ తేదీ వరకు న్యూఢిల్లీలో జరగనున్న ఆల్ ఇండియా సివిల్ సర్వీసెస్ ఎంప్లాయీస్ ఖోఖో పోటీలకు రంగశాయిపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఫిజికల్ డైరెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న గోగు నారాయణ ఎంపికయ్యారు. ఈమేరకు గురువారం ఆయన న్యూఢిల్లీకి బయలుదేరి వెళ్లారు.

సీపీని కలిసిన టీజీ ఎస్పీ కమాండెంట్ రామ్‌ప్రకాశ్



మామునూరు: వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్‌ను మామునూరు టీజీఎస్పీ నాలుగో బెటాలియన్ కమాండెంట్ రాంప్రకాశ్ గురువారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సీపీకి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

టీబీ రహిత సమాజానికి కృషి

విద్యారణ్యపురి: టీబీ రహిత సమాజాన్ని తీర్చిదిద్దాల్సిన అవసరం అందరిపై ఉందని టీబీ నివారణ అధికారి హిమబిందు అన్నారు. హనుమకొండలోని లష్కర్‌బజార్‌లోని ప్రభుత్వ ప్రాక్టీసింగ్ క్షయ వ్యాధిపై గురువారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. క్షయ వ్యాధి లక్షణాలు కనపడగానే సమీపంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వెళ్లి పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. సమావేశంలో పాఠశాల స్కూల్ ప్రిన్సిపాల్ జగన్, జిల్లా క్షయవ్యాధి కోఆర్డినేటర్ సుష్మ, అధికారి కిరణ్‌కుమార్, నగేష్, విజయ్, తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలో తాగునీటి సౌకర్యం

విద్యారణ్యపురి: మర్కజీ హైస్కూల్‌లో మంచినీటి వసతి కోసం పానుగంటి స్వరూప్‌రెడ్డి మెమోరియల్ ట్రస్టు ఆధ్వర్యంలో రూ.20 వేల విలువచేసే వాటర్‌ట్యాంకును ఏర్పాటు చేసి నీటివసతి కల్పించారు. ట్రస్టు నిర్వాహకురాలు సరితారెడ్డి మాట్లాడుతూ తన భర్త స్వరూప్‌రెడ్డి ఉపాధ్యాయుడిగా ఇక్కడే విధులు నిర్వర్తించారని, ఆయన జ్ఞాపకార్థం పలువురు ఉపాధ్యాయులతో కలిసి ట్రస్టు ఏర్పాటు చేసి సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో హెచ్‌ఎం జి.వీరామరావు, ట్రస్టు సభ్యులు రంగారెడ్డి, వలస పైడి, రూపాటి కిరణ్‌కుమార్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యా కళాశాల ఫీజుల వ్యవహారంపై విచారణ కమిటీ

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలోని విద్యా కళాశాలలో మోడరేషన్ ప్రాసెస్ ఫీజుల కలెక్షన్ యూనివర్సిటీ అఫ్లియేటెడ్ విద్యా కళాశాలల ఫైనల్ ఇయర్ విద్యార్థుల రికార్డులకు సంబంధించిన వ్యవహారంలో విచారణ కమిటీని నియమిస్తూ కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ రామచంద్రం గురువారం ఉత్తర్వులు జారీచేశారు. కమిటీ చైర్మన్‌గా కేయూ సైన్స్ డీన్ ప్రొఫెసర్ హనుమంతు, విద్యా కళాశాల బోర్డు ఆఫ్ స్టడీస్ చైర్మన్‌గా డాక్టర్ ఆర్.విజయలత, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ అండ్ హెచ్‌ఆర్‌ఎం విభాగం అధిపతి శ్రీనివాస్‌రావు సభ్యులుగా, అకడమిక్ బ్రాంచ్ అసిస్టెంట్ రిజిస్ట్రార్ డాక్టర్ కోల శంకర్‌ను మెంబర్ కన్వీనర్‌గా నియమించారు. త్వరగా విచారణ చేసి రిపోర్టు అందజేయాలని కమిటీని రిజిస్ట్రార్ ఆదేశించారు.

ప్రెస్ క్లబ్ ఆస్తి పన్ను చెల్లింపు

నయీంనగర్: ఆస్తి పన్ను చెక్కును గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్ బాధ్యులు క్లబ్ ఆవరణలో బిల్ కలెక్టర్ టి.విజయ్‌కుమార్, వార్డు ఆఫీసర్ నీరటి నవ్యశ్రీకి గురువారం అందించారు. ఈ సందర్భంగా ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు వేముల నాగరాజు మాట్లాడుతూ ప్రస్తుత పన్నుతో పాటు బకాయి బిల్లులు కూడా చెల్లించినట్లు తెలిపారు. ప్రధాన కార్యదర్శి బొల్లారపు సదయ్య, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

ఎల్ఆర్ఎస్.. అటెన్షన్



రాయితీ గడువు సమీపిస్తుండడంతో దరఖాస్తుదారుల్లో ఆందోళన

- ఇప్పటికే తప్పుడు ఎంట్రీలతో రూ.లక్షల్లో అదనపు భారం
- ప్లాట్ల పరిశీలనకు ముందే క్రమబద్ధీకరణ ఫీజుతో హైరానా
- మాస్టర్‌ప్లాన్ రోడ్డులో పోయే స్థలాలకూ ఆటోమేటిక్ ఫీజు

గ్రేటర్ పరిధిలో వచ్చిన ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల వివరాలు..

దరఖాస్తులు	పరిశీలించినవి	ఫీజు చెల్లించింది	ప్రొసీడింగ్‌లు
1.10 లక్షలు	40 వేలు	14,088 మంది	680 మందికి
ఎస్ఎంఎస్‌లు	షార్ట్‌ఫాల్స్	ఆటోమేటిక్ ఫీజు జనరేట్	
25,000 మందికి	15వేల మందికి	35,000 మందికి	

సాక్షి, వరంగల్: దరఖాస్తుదారులను ఎల్ఆర్ఎస్ బెంబేలెత్తిస్తోంది. 2020 ఆగస్టు 31కి ముందు కొనుగోలు చేసిన సేల్ డీడ్ ప్రకారమే ప్లాట్లకు ఎల్ఆర్ఎస్ చార్జీలు విధించాలి. కానీ, తాజా మార్కెట్ విలువతోపాటు మార్కెట్ రేటును మించి మూడింతలు చార్జీలు విధిస్తుండడంతో అయోమయంలో ఉన్నారు. అదేవిధంగా క్షేత్రస్థాయి సందర్శన లేకుండానే వరంగల్ మహా నగర మాస్టర్‌ప్లాన్ రోడ్డులో పోయే ప్లాట్లకు సైతం ఆటోమేటిక్ ఫీజు వసూలు వివాదాస్పదమవుతోంది. ఫీజు చెల్లించిన తర్వాతే సదరు ప్లాట్‌ను అధికారులు క్షేత్రస్థాయి సందర్శన చేసి ఫైనల్ ప్రొసీడింగ్స్ ఇవ్వడం బాగానే ఉంది. ఒకవేళ మాస్టర్‌ప్లాన్, రోడ్డు డెవలప్‌మెంట్ ప్లాన్ ప్రకారం రోడ్ల విస్తరణలో ఎంత కావాలో అంత రిజిస్టర్డ్ గిఫ్ట్ ద్వారా ఉచితంగా సంబంధిత విభాగానికి బదిలీ చేయాలనే నిబంధన కలవరపెడుతోంది. ఆటోమేటిక్ ఫీజు ఖరారు చేసే ముందు క్షేత్రస్థాయి సందర్శన చేసి ఎంతవరకు మాస్టర్ ప్లాన్ ప్రతిపాదిత రోడ్డులో వెళ్తుందో మినహాయించి మిగిలిన విస్తీర్ణానికి డబ్బులు చెల్లిస్తే దరఖాస్తుదారులకు భారం తగ్గుతుంది. అటు రూ.లక్షల్లో ఫీజు చెల్లించి.. ఇటు ప్లాట్ రోడ్డు విస్తరణ కోసం ఉచితంగా ఇవ్వడమేంటని ప్రశ్నిస్తున్నారు.

ట్యాబ్‌లు రాగానే క్షేత్రస్థాయి పరిశీలన..

చెరువుల ఎఫ్‌టీఎల్‌కు 200 మీటర్ల పరిధి ప్రభుత్వ భూములకు ఆనుకుని ఉన్న సర్వే నంబర్లు మినహా మిగిలిన సర్వే నంబర్లలోని ఎల్ఆర్ఎస్ దరఖాస్తులకు ఆటోమేటెడ్‌గా ఫీజు ఖరారు చేస్తున్నారు. మార్చి 31లోగా ఎల్ఆర్ఎస్ ఫీజు చెల్లిస్తేనే 25 శాతం రాయితీ వర్తిస్తుందని స్పష్టం చేసింది. ఈమేరకు గురువారం నాటికి మరో 35,000 మందికి ఆటోమేటిక్ ఫీజు జనరేట్ చేశారు. వీటిలో ఫీజు చెల్లించిన వారి ప్లాట్లను అధికారులు సందర్శించి ఫైనల్ ప్రొసీడింగ్స్ ఇవ్వనున్నారు. మరో రెండు రోజుల్లో ప్రత్యేక సాఫ్ట్‌వేర్‌తో కూడిన ట్యాబ్‌లు రాగానే ఈ క్షేత్రస్థాయి పరిశీలన ఉంటుందని ఓ అధికారి తెలిపారు. ఒకవేళ క్షేత్రస్థాయి సందర్శన తర్వాత నిబంధనలకు విరుద్ధంగా ఉందని తిరస్కరిస్తే పది శాతం ఫీజు మినహాయించుకొని మిగతాది చెల్లిస్తామని అన్నారు.

ఫీజులో ఎంత తేడా...

- వడ్డేపల్లిలోని విజయపాల్‌కాలనీ ఫేజ్–2లో 1981లో 250 గజాల స్థలాన్ని ఎం.సుధారాణి సేల్ డీడ్ ప్రకారం రూ.1250కు కొనుగోలు చేశారు. ఈ ప్లాట్ క్రమబద్ధీకరణకు ఆమె దరఖాస్తు చేసుకున్నారు. ఈ సమయంలో సమర్పించిన సేల్ డీడ్ ఉన్న సంవత్సరం ఆధారంగానే చార్జీలు విధించాలి. బెటర్‌మెంట్ చార్జీలు రూ.25,080, ఓపెన్ స్పేస్ చార్జీలు రూ.175 కలుపుకొని రూ.25,255 రావాలి. ఇందులో 25 శాతం రిబేట్ పోగా.. రూ.18,942 ఫీజు రావాలి. కానీ, అధికారులు చేసిన తప్పుడు మార్కెట్ విలువతో ఏకంగా రూ.7,41,806 ఫీజు రావడంతో లబోదిబోమంటున్నారు. రెగ్యులేషన్ చార్జీలు రూ.41,086 వస్తే ఓపెన్ స్పేస్ చార్జీలు ఏకంగా రూ.ఏడు లక్షలు రావడంతో కంగుతిన్నారు. ఇక్కడ ప్రస్తుత మార్కెట్ విలువ గజానికి రూ.ఏడు వేలు ఉంటే ఏకంగా రూ.20,000 నిర్ధారించడం వల్లే ఇదంతా జరిగింది.
- విమలకు కాజీపేటలో ఉన్న 600 గజాల స్థలానికి రెగ్యులైజేషన్ చార్జీలు రూ.70,235 వస్తే ఓపెన్ స్పేస్ చార్జీ రూ.9,800 మాత్రమే వచ్చింది. నగరశివారు ప్రాంతం స్తంభంపల్లి శివారులో 216 గజాలకు క్రమబద్ధీకరణ చేసుకోవడానికి రంగు ఉమాదేవి రూ.32,644 చెల్లించాలి. కానీ, తప్పుడు ఎంట్రీతో రూ.1,87,435 చెల్లించాల్సిన పరిస్థితి వచ్చింది.

ఈ విధంగా చేస్తే మేలు..

'2012, 2015–16, 2018 మాదిరిగానే ఎల్ఆర్ఎస్ ప్రక్రియ చేపట్టాలి. అప్పుడు తొలుత రూ.పది వేలు చెల్లించిన తర్వాత లైసెన్స్‌డ్ సర్వేయర్ల సహకారంతో క్షేత్రస్థాయి సందర్శన చేశాకే ఫీజు చెల్లించాలంటూ ఎస్ఎంఎస్‌లు పంపితే చెల్లించారు. ఇప్పుడు కూడా దరఖాస్తులు పరిశీలించిన తర్వాతే ఫీజు తీసుకోవాలి. 2020 ఎల్ఆర్ఎస్‌లో ఎడిట్ ఆప్షన్ ఇవ్వాలి. లైసెన్స్‌డ్ సర్వేయర్లను నియమించుకుంటేనే తప్పులు దొర్లే అవకాశం ఉండదు. ఎల్ఆర్ఎస్ ప్రొసీడింగ్స్‌లో గతంలో మాదిరిగానే డాక్యుమెంట్ నంబర్, ప్లాన్‌ను పొందుపరచాలి. లేదంటే భవన నిర్మాణసమయంలో దరఖాస్తుదారులకు ఇబ్బందులు తలెత్తే అవకాశముంది' అని బల్దియాలోని ఓ ప్లానింగ్ అధికారి తెలిపారు.

'పది' పరీక్షలకు సర్వం సిద్ధం

- హనుమకొండ జిల్లాలో పరీక్షలు రాయనున్న 12,010 మంది విద్యార్థులు
- 67 కేంద్రాల ఏర్పాటు
- వరంగల్ జిల్లాలో 9,237 మంది విద్యార్థులు
- 49 పరీక్ష కేంద్రాలు
- సీఎస్ గదుల్లో సీసీ కెమెరాల నిఘా
- నాలుగు బృందాల ఫ్లయింగ్ స్క్వాడ్లు
- 67 మంది సిట్టింగ్ స్క్వాడ్లు

విద్యారణ్యపురి: హనుమకొండ, వరంగల్ జిల్లాల్లో టెన్త్ పరీక్షలకు అధికారులు సర్వం సిద్ధం చేశారు. శుక్రవారం (నేటి) నుంచి ఏప్రిల్ 4 వరకు పరీక్షలు కొనసాగనున్నాయి. అందుకు జిల్లా విద్యాశాఖ అన్ని ఏర్పాట్లు చేసింది. హనుమకొండ జిల్లాలో అన్ని యాజమాన్యాలు కలిపి 12,010 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. 318 పాఠశాలల్లో బాలురు 6,339 మంది, బాలికలు 5,671 మంది ఉన్నారు. పరీక్షల నిర్వహణకు 67 కేంద్రాలను ఏర్పాటు చేశారు. అందులో 41 ప్రభుత్వ యాజమాన్యాల పరిధి పాఠశాలల్లో, 26 ప్రైవేట్ హైస్కూళ్లలోనూ పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. 67 మంది చీఫ్ సూపరింటెండెంట్లు, 67 మంది డిపార్టుమెంటల్ ఆఫీసర్లను, 600 మంది ఇన్విజిలేటర్లను నియమించారు. పరీక్షలు ఉదయం 9:30 గంటల నుంచి మధ్యాహ్నం 12:30 గంటల వరకు నిర్వహిస్తారు. ఫిజికల్ సైన్స్, బయాలాజికల్ సైన్స్ పరీక్షలు మాత్రం ఉదయం 9–30 గంటల నుంచి 11 గంటల వరకు పరీక్షలు జరుగుతాయి. పరీక్షలకు నిర్దేశించిన సమయానికి గంట ముందుగానే విద్యార్థులు కేంద్రాలకు చేరుకోవాలి. నిర్దేశించిన సమయం ఉదయం 9:30 గంటల తర్వాత ఐదు నిమిషాలు ఆలస్యమైనా అనుమతిస్తారు. ఆతర్వాత అనుమతించరు. జవాబులు రాసేందుకు ఈసారి 24 పేజీల బుక్‌లెట్‌ను అందించనున్నారు.

ఫ్లయింగ్ స్క్వాడ్‌లు, సిట్టింగ్ స్క్వాడ్లు

హనుమకొండ జిల్లాలో పరీక్షలను పకడ్బందీగా నిర్వహించేందుకు జిల్లాలో నాలుగు ఫ్లయింగ్ స్క్వాడ్‌లను నియమించారు. ప్రతీ కేంద్రానికి ఒకరు చొప్పున 67 మందిని సిటింగ్ స్క్వాడ్లను నియమించారు. సంబంధిత జిల్లా అధికారులు కూడా పరీక్షల నిర్వహణను పర్యవేక్షిస్తారు.

వరంగల్ జిల్లాలో 9,237 మంది రెగ్యులర్ విద్యార్థులు

వరంగల్ జిల్లాలో టెన్త్ పరీక్షలకు జిల్లా విద్యాశాఖ ఏర్పాట్లు పూర్తి చేసింది. జిల్లాలోని 287 పాఠశాలల్లో 9,237 మంది రెగ్యులర్ విద్యార్థులు, ప్రైవేట్ అభ్యర్థులు 155 మంది పరీక్షలు రాయనున్నారు. 49 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. 49 మంది సీఎస్, 50 మంది డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్లను నియమించారు. 559 మంది ఇన్విజిలేటర్లను నియమించారు. రెగ్యులర్ విద్యార్థుల్లో బాలురు 4,803 మంది, బాలికలు 4,434 మంది పరీక్షలు రాయనున్నారు. ఫ్లయింగ్‌స్క్వాడ్లు 3 బృందాలు, సిట్టింగ్‌స్క్వాడ్లు 49 మందిని నియమించారు.

పకడ్బందీగా నిర్వహిస్తాం..



హనుమకొండ జిల్లాలో ఈనెల 21 నుంచి పదో తరగతి పరీక్షల నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి చేశాం. పరీక్షలను పకడ్బందీగా నిర్వహించేందుకు అన్ని చర్యలు తీసుకున్నాం. విద్యార్థులు ఎలాంటి ఒత్తిళ్లకు లోనవ్వకుండా ప్రశాంతంగా పరీక్షలు రాయాలి. విద్యార్థులకు ఏమైనా సందేహాలుంటే.. హనుమకొండ డీఈఓ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్ నంబర్లలో సంప్రదించవచ్చు.

- డి.వాసంతి, డీఈఓ, హనుమకొండ

23 నుంచి సమరయోధుల వారోత్సవాలు



వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నాయకులు

హన్మకొండ: బ్రిటిష్ సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా పోరాడి ఉరితాడును ముద్దాడిన యువ కిశోరులు భగత్‌సింగ్, రాజ్‌గురు సుఖదేవ్‌ల 94వ వర్ధంతి వారోత్సవాలను విజయవంతం చేయాలని ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం (పీడీఎస్‌యూ) ఉమ్మడి వరంగల్ జిల్లా మాజీ అధ్యక్షుడు రాచర్ల బాలరాజు, ప్రధాన కార్యదర్శి మంత్రి మహేష్ పిలుపునిచ్చారు. ఈమేరకు హనుమకొండలోని కాళోజీ విగ్రహం వద్ద ఉమ్మడి వరంగల్ జిల్లా కార్యవర్గం ఆధ్వర్యంలో వాల్‌పోస్టర్లను గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈనెల 23 నుంచి 30వ తేదీ వరకు 94వ వర్ధంతి వారోత్సవాలు నిర్వహించాలని నిర్ణయం తీసుకున్నట్లు వారు వివరించారు. పీడీఎస్‌యూ జిల్లా కోశాధికారి పవన్, నాయకులు పాల్గొన్నారు.

వర్షం.. జరభద్రం

- నాలుగు జిల్లాలకు పొంచి ఉన్న వాన
- పంటల విషయంలో రైతులు అప్రమత్తం

సాక్షి, వరంగల్: ఎండలతో కొన్ని రోజులుగా అల్లాడుతున్న ప్రజలు గురువారం ఒక్కసారిగా వాతావరణం చల్లబడడంతో హమ్మయ్యా అని ఊపిరి పీల్చుకున్నారు. మధ్యాహ్నం ఒంటిగంట నుంచి ఆదివారం ఉదయం 8.30 గంటల వరకు ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతోపాటు వడగళ్ల వాన కురిసే అవకాశముందని వాతావరణ శాఖ ప్రకటించడతో రైతులు అప్రమత్తమయ్యారు. ఇప్పటికే ఎండబెట్టిన మిర్చి, వరి, మొక్కజొన్నలను రైతులు బస్తాల్లో నింపుతున్నారు. ఇంకొందరు పరదాలు సిద్ధం చేసుకున్నారు. జయశంకర్ భూపాలపల్లిలో అక్కడక్కడ ఉరుములు, మెరుపులు, ఈదురు గాలుల (గాలి వేగం గంటకు 40 నుంచి 50 కిలోమీటర్లు)తోపాటు వడగాళ్లతో కూడిన వర్షం శుక్ర, శని, ఆదివారాల్లో కురిసే అవకాశముంది. వరంగల్, హనుమకొండ జిల్లాల్లో అక్కడక్కడ ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన వర్షం శుక్రవారం ఉదయం 8.30 నుంచి శనివారం ఉదయం 8.30 గంటల మధ్యలో కురిసే అవకాశముంది. శని, ఆదివారాల్లో హనుమకొండ, జనగామ జిల్లాల్లో ఉరుములు, మెరుపులు, ఈదురు గాలులతో కూడిన వర్షం కురిసే చాన్స్ ఉందని వాతావరణ శాఖ పేర్కొంది.

రైతులు జాగ్రత్త..

'జిల్లాల్లో తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు కురిసే సూచనలు ఉన్నాయి. కోసిన వరి, మొక్కజొన్న, శనగ, పెసర, మినుము, జొన్న, పొద్దుతిరుగుడు, నువ్వులు తదితర పంటలను జాగ్రత్తగా సురక్షిత ప్రాంతాలకు తరలించాలి. మార్కెట్‌కు తరలించిన ధాన్యం తడవకుండా టార్పాలిన్‌తో కప్పి ఉంచాలి. కోతకు సిద్ధంగా ఉన్న టమాట, వంకాయ, బెండకాయ, మిర్చి పంటలు కోయాలి. తాత్కాలికంగా పురుగు మందుల పిచికారీ ఆపాలి. వడగాళ్ల వర్షం కురిసే అవకాశం ఉండడంతో పశువులు, మేకలు, గొర్రెలను సురక్షిత ప్రాంతాల్లో ఉంచాలి' అని వ్యవసాయ అధికారులు సూచించారు.

కేయూ టెక్నికల్ స్టాఫ్ అసోసియేషన్ ఎన్నికలు ఏకగ్రీవం



శ్రీనివాస్, అధ్యక్షుడు



ఎన్.రాము, సెక్రటరీ

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ టెక్నికల్ స్టాఫ్ అసోసియేషన్ ఎన్నికలు ఏకగ్రీవం అయ్యాయి. అధ్యక్షుడిగా డాక్టర్ పుల్లా శ్రీనివాస్, జనరల్ సెక్రటరీగా ఎన్.రాము, జాయింట్ సెక్రటరీగా (ఆర్గనైజేషన్) రవికుమార్, జాయింట్ సెక్రటరీగా వై.బాబు (రిక్రియేషన్), కోశాధికారిగా ప్రేమసాగర్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

డైరెక్టర్ పదవికి రాజీనామా

హసన్‌పర్తి: వంగపహాడ్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం డైరెక్టర్ పదవికి రాజీనామా చేస్తున్నట్లు మేరుగుర్తి కల్పన ప్రకటించారు. ఈమేరకు తన రాజీనామా పత్రాన్ని డీసీఓకు అందజేశారు. సొసైటీ సమావేశాలకు సక్రమంగా రానందుకు జారీ చేసిన నోటీసులకు సకాలంలో సమాధానం ఇవ్వలేదని పేర్కొన్నారు. చైర్మన్ వైఖరిని నిరసిస్తూ పదవికి రాజీనామా చేస్తున్నట్లు తెలిపారు.

ఏకశిల స్కూల్‌లో ఇంగ్లిష్ ఫెయిర్



ఖిలా వరంగల్: వరంగల్ శివనగర్‌లోని ఏకశిల డిజీ స్కూల్‌లో గురువారం ఇంగ్లిష్ ఫెయిర్ నిర్వహించారు. ఈ సందర్భంగా నర్సరీ నుంచి 10వ తరగతి వరకు విద్యార్థులు హాజరయ్యారు. ముఖ్యఅతిథిగా స్కూల్ డైరెక్టర్ బేతి కొండల్‌రెడ్డి హాజరై ఫెయిర్‌ను ప్రారంభించి మాట్లాడారు. విద్యార్థులు ఆంగ్ల భాష నైపుణ్యాలను పెంపొందించుకోవాలని సూచించారు. ప్రిన్సిపాల్ లవకుమార్, స్వప్నలత, సోహెల అంజుమ్, ట్వింకిల్, చందన, స్వాతి పాల్గొన్నారు.

సీజన్‌కు ముందే పనులు పూర్తిచేయండి

రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ భద్రకాళి చెరువు పూడికతీత పనుల పరిశీలన



మంత్రికి ప్లాన్ వివరిస్తున్న అధికారులు

హన్మకొండ కల్చరల్/హన్మకొండ అర్బన్ : రాబోయే వానాకాలం సీజన్ రాకకు ముందే భద్రకాళి చెరువు పూడికతీత పనులు పూర్తికావాలని రాష్ట్ర పర్యావరణ, అటవీశాఖ, దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం మంత్రి సురేఖ చెరువు పూడికతీత పనులను మేయర్ గుండు సుధారాణి, వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు, కుడా చైర్మన్ ఇనగాల వెంకట్రాంరెడ్డి, హనుమకొండ, వరంగల్ కలెక్టర్లు ప్రావీణ్య, డాక్టర్ సత్యశారద, బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే, సంబంధిత శాఖల అధికారులతో కలిసి పరిశీలించారు. పూడికతీత పనులను కలెక్టర్, అధికారులు మంత్రికి వివరించారు. ఈ మేరకు వచ్చే సోమవారం విద్యుత్ లైట్లను, తగినంత సిబ్బందిని ఏర్పాటు చేసి రాత్రివేళలోనూ పనులను వేగవంతం చేస్తామని కలెక్టర్ ప్రావీణ్య వివరించారు. మట్టిని తీసుకెళ్లి తిరిగి వచ్చే వాహనాలకు రెండు వైపులా అంతర్గత రోడ్లను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. జూపార్క్ వైపు నుంచి వచ్చే మురుగునీరును భద్రకాళి చెరువులో చేరకుండా ప్రణాళికను రూపొందించాలని కుడా చైర్మన్ వెంకట్రాంరెడ్డి.. మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. కాగా, అంతకుముందు కలెక్టరేట్‌లో కలెక్టర్ ప్రావీణ్య.. అధికారులతో పూడికతీత పనులపై సమీక్షించారు. ఆయా కార్యక్రమాల్లో సాగునీటి పారుదలశాఖ ఈఈ శంకర్, అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి, కుడా పీఓ అజిత్‌రెడ్డి, ఇతర శాఖాధికారులు పాల్గొన్నారు.

పిల్లల్లో ఆత్మవిశ్వాసం పెంపొందించాలి



మాట్లాడుతున్న హరగోపాల్

హసన్‌పర్తి / హన్మకొండ: బాల్యం నుంచే పిల్లల్లో ఆత్మవిశ్వాసం పెంపొందించాలని ప్రొఫెసర్ హరగోపాల్ సూచించారు. పూరిగుట్టలోని సాయి ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్మించిన సాయి స్పందన హైస్కూల్ నూతన భవనాన్ని గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీ పిల్లవాడిని పాఠశాలకు పంపించే బాధ్యత తల్లిదండ్రులదేనని గుర్తుచేశారు. బాలికల విద్యను ప్రోత్సహించాలని కోరారు. సాయి ట్రస్ట్ వ్యవస్థాపకుడు రంగయ్య అధ్యక్షతన జరిగిన సమావేశంలో డాక్టర్ వనమాల, ప్రొఫెసర్ చిన్నాల బాలరాములు, స్కూల్ వైస్ ప్రెసిడెంట్ వాసుదేవారెడ్డి, సీడబ్ల్యూసీ మాజీ చైర్మన్ మండల పరశురాములు, ట్రస్ట్ సెక్రటరీ లింగమూర్తి, ట్రస్ట్ సభ్యులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.


పార్ట్‌టైం నియామకాలు చేపట్టాలి



ఆందోళన చేస్తున్న అభ్యర్థులు

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలో పార్ట్ టైం అధ్యాపకుల నియామకానికి నోటిఫికేషన్ ఇవ్వాలని ఆశావాహ అభ్యర్థులు యూనివర్సిటీలోని పరిపాలన భవనం వద్ద గురువారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పదేళ్ల నుంచి కాకతీయ యూనివర్సిటీలో పార్ట్‌టైం నోటిఫికేషన్ విడుదల కాలేదని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పుడు కేవలం 77మంది రెగ్యులర్ అధ్యాపకులే ఉన్నారని అన్నారు. ధర్నాలో డాక్టర్ వడ్డెపెల్లి మధు, అరూరి రంజిత్‌కుమార్, పంతగాని చందర్‌రావు, వంగా మల్లేశ్, సురేష్, మద్దిరాల మోహన్‌రెడ్డి, ఉషానాయక్, ఉర్సు రాజేందర్, భూక్య వెంకట్, బానోతు స్వామి, జట్టి రాజేందర్, పుల్ల కుమార్, రాజేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

23న ఎస్ఎఫ్ఐ నాయకుల సమ్మేళనం



వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నాయకులు

నయీంనగర్: భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ)లో 1970 నుంచి 2025 వరకు క్రియాశీలకంగా పనిచేసిన విద్యార్థి నాయకులు, కార్యకర్తలతో భగత్‌సింగ్ వర్ధంతి రోజైన మార్చి 23న ఆత్మీయ సమ్మేళనాన్ని హనుమకొండ కాళోజీ కళాక్షేత్రంలో నిర్వహించనున్నట్లు ఉమ్మడి వరంగల్ జిల్లా ఎస్ఎఫ్ఐ మాజీ జిల్లా కార్యదర్శి సారంపల్లి వాసుదేవరెడ్డి తెలిపారు. హనుమకొండ ప్రెస్ క్లబ్‌లో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో సమ్మేళనానికి సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గడిచిన 55 ఏళ్లలో ఎస్ఎఫ్ఐలో పనిచేసిన విద్యార్థి నాయకులు, కార్యకర్తలు తరలివచ్చి సమ్మేళనాన్ని జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ ఉమ్మడి వరంగల్ జిల్లా మాజీ జిల్లా కార్యదర్శులు టి.ఉప్పలయ్య, రాగుల రమేష్, మెరుగు అశోక్, గానుగుపాటి గంగాధర్‌రెడ్డి, బీరెడ్డి సాంబశివ, దొగ్గెల తిరుపతి, మాజీ నగర కార్యదర్శి గడ్డం రవి, మాజీ సిటీ ప్రెసిడెంట్ హరికిషన్ పాల్గొన్నారు.

మహిళా చట్టాలపై అవగాహన అవసరం



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న అతిథులు

హసన్‌పర్తి: మహిళా చట్టాలపై అతివలు అవగాహన కలిగి ఉండాలని సఖి కౌన్సెలర్ పావని అన్నారు. హసన్‌పర్తి మండలం భీమారంలో సఖి సేవలపై మహిళా శిశు సంక్షేమ శాఖ, సర్వోదయ యూత్ ఆర్గనైజేషన్ గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా పావని మాట్లాడుతూ వైద్య, న్యాయ, పోలీసు సహాయం, తాత్కాలిక వసతి అందిస్తున్నట్లు వివరించారు. సఖి సెంటర్ సేవలు 24 గంటల పాటు అందుబాటులో ఉంటాయన్నారు. ఆపద సమయంలో బాధిత మహిళలు, బాలికలు 181 నంబర్‌లో సంప్రదించాలని కోరారు. అనంతరం సఖి సేవల వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. సదస్సులో కేర్ వర్కర్ అనూష, సభ్యులు రమేష్, మహిళా సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా

పూర్వ విద్యార్థులు తరలిరావాలి

రామన్నపేట: ఈనెల 23వ తేదీన వరంగల్ ప్రభుత్వ పాలిటెక్నిక్ పూర్వ విద్యార్థుల సంఘం సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు పూర్వ విద్యార్థుల సంఘం అడ్‌హాక్ కమిటీ కన్వీనర్ ఈవీ.శ్రీనివాసరావు తెలిపారు. పాలిటెక్నిక్ కళాశాలలో జరిగిన సమావేశంలో కమిటీ సలహాదారు స్వామి, సభ్యులు అక్షయ్‌కుమార్, సతీష్‌రెడ్డి, శ్రీనివాస్‌రావు, ఉమేందర్, కుమార్, రాజు, భిక్షపతి, వసంత్, ఆరిఫ్, స్వామాట్ పాల్గొన్నారు.

ఎన్‌సీసీ కేడెట్ల ఎంపికలు

కాజీపేట రూరల్: కాజీపేట ఫాతిమానగర్‌లోని బిషప్ బెరెట్టా హైస్కూల్‌లో పదో పటాలం కమాండింగ్ ఆఫీసర్ లెఫ్టినెంట్ కల్నల్ రామదురై ఆదేశానుసారం ఎన్‌సీసీ కేడెట్ల ఎంపికలు గురువారం జరిగాయి. ఈక్రమంలో ఎన్‌సీసీలో చేరిన విద్యార్థులను బిషప్ బెరెట్టా పాఠశాల హెడ్‌మాస్టర్ రెవరెండ్ ఫాదర్ జయప్రతాప్ రెడ్డి, ఎన్‌సీసీ అసోసియేట్ ఆఫీసర్ కె.భవాని గురువారం అభినందించారు. ఎన్‌సీసీ హవల్దార్లు దీపక్ వాఘ్, బాబాసాహెబ్, భవాని, సిస్టర్ కల్పన, జి.స్టెనిస్లాస్ రెడ్డి, సతీష్‌రెడ్డి, సురేందర్ ఆధ్వర్యంలో విద్యార్థులకు ఫిజికల్ టెస్ట్, రాత పరీక్షలను బుధవారం నిర్వహించారు.

జాటోతు ఠాను నాయక్‌కు నివాళి

హన్మకొండ: భూమి కోసం, భుక్తి కోసం, నిజాం సర్కారుకు వ్యతిరేకంగా పోరాడిన పోరాట యోధుడు జాటోతు ఠాను నాయక్ అని విద్యుత్ ఎస్టీ ఉద్యోగుల సంక్షేమ సంఘం ఎన్పీడీసీఎల్ కంపెనీ సెక్రటరీ అజ్మీర శ్రీరాం నాయక్ అన్నారు. ఠాను నాయక్ 76వ వర్ధంతిని పురస్కరించుకుని బాలసముద్రంలోని ఠాను నాయక్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు వాలు నాయక్, వైస్ ప్రెసిడెంట్ తారాచంద్ నాయక్, నాయకులు పాల్గొన్నారు.

విద్యారంగానికి అధిక నిధులు కేటాయించాలి

కేయూ క్యాంపస్: రాష్ట్ర బడ్జెట్‌లో విద్యారంగానికి అధిక నిధులు కేటాయించాలని జార్జిరెడ్డి పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ ఎస్.నాగేశ్వర్‌రావు డిమాండ్ చేశారు. కాకతీయ యూనివర్సిటీలో గురువారం నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో పీడీఎస్‌యూ నూతన కమిటీని ఎన్నుకున్నారు. జార్జిరెడ్డి పీడీఎస్‌యూ ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడిగా దుర్గం సారయ్య, ప్రధాన కార్యదర్శిగా బాషబోయిన వేణురాజ్, ఉపాధ్యక్షుడిగా శివకుమార్, సహాయ కార్యదర్శిగా మహ్మద్ కలాం, కోశాధికారిగా నవీన్ ఎన్నికయ్యారు.

రైలుకింద పడి వ్యక్తి బలవన్మరణం

ఖిలా వరంగల్: మద్యానికి బానిసైన ఓ వ్యక్తి జీవితంపై విరక్తి చెంది రైలుకింద పడి ఆత్మహత్య చేసుకున్నాడని వరంగల్ జీఆర్పీ హెడ్ కానిస్టేబుల్ రాజు తెలిపారు. హనుమకొండ కొత్తూరు ప్రాంతానికి చెందిన పోతర్ల నరేష్ (48) కిరాణం షాపు నిర్వహిస్తూ ఇటీవల మద్యానికి బానిసయ్యాడు. ఈక్రమంలో కుటుంబ సభ్యులు అతడితో మద్యం మానిపించాలని మాలధారణ వేయించారు. మద్యానికి ఒక్కసారిగా దూరమవడంతో రైలుకింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతదేహానికి పోస్టుమార్టం చేసి మృతుడి కుమారుడు అజయ్‌కుమార్‌కు అప్పగించినట్లు హెడ్ కానిస్టేబుల్ వివరించారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధుడి దుర్మరణం

మామునూరు: వరంగల్ – ఖమ్మం జాతీయ రహదారిపై మామునూరు పోలీస్‌స్టేషన్ ఎదురుగా గురువారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో వృద్ధుడు దుర్మరణం చెందాడు. పోచమ్మమైదాన్‌కు చెందిన సిరబోయిన బాబు (63) కొద్దిరోజులు మతిస్థిమితం కోల్పోయి తిరుగుతున్నాడు. ఈక్రమంలో గురువారం ఉదయం వరంగల్ పోచమ్మమైదాన్ నుంచి వర్ధన్నపేట వైపు నడుచుకుంటూ వెళ్తుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో అతడు అక్కడికక్కడే మృతిచెందాడు.

కుంభాభిషేకం కరపత్రాల ఆవిష్కరణ

ఖిలా వరంగల్: శిఖర కుంభాభిషేకం జరిగి 12 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా వరంగల్ శివనగర్‌లోని సీతారామచంద్ర స్వామి దేవాలయ ప్రాంగణంలో ఆలయ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో ఏప్రిల్ 2 నుంచి 4వ తేదీ వరకు రామలింగేశ్వరస్వామి, శ్రీలలితాదేవి, పంచముఖ హనుమాన్, గణపతి విగ్రహ పునఃప్రతిష్ఠ, రామాలయ, సుబ్రహ్మణ్యేశ్వర స్వామి శిఖరాల కుంభాభిషేకం మహోత్సవ జరగనుంది. ఈమేరకు ఉత్సవాల కరపత్రాన్ని మంత్రి కొండా సురేఖ ఆవిష్కరించారు.